# హైకోర్టు కోసం.. బయోడైవర్సిటీ బలి

- విద్యార్థుల ఆందోళనలు బేఖాతరు
- 'కోడ్' కూసినా పనులు మొదలు
- భారీ యంత్రాలతో చెట్ల కూల్చివేత
- విద్యార్థులను బెదిరిస్తున్న పోలీసులు
- నేడు పనులు అడ్డుకునేందుకు ప్రజాసంఘాల పిలుపు



డ్రోన్ కార్యాలయం వెనుక చదును చేసిన దృశ్యం

వ్యవసాయ యూనివర్సిటీ , మార్చి 24: ఉద్యమాలు వృథా అయ్యాయి. విద్యార్థుల నినాదాలు అరణ్య రోదనలే అయ్యాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హైకోర్టు వద్దు మొర్రో అని విద్యార్థులు, మేధావులు మొత్తుకున్నా పట్టించుకోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల కోడ్‌ను విస్మరించి మరీ రాత్రివేళ పనులు ప్రారంభించింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని దాదాపు 100 ఎకరాల్లో నూతన హైకోర్టు నిర్మాణ పనులు మొదలయ్యాయి. విషయం తెలిసిన వర్సిటీ విద్యార్థులు వివరాలు అడిగే ప్రయత్నం చేస్తే కేసులు, అరెస్టుల వరకు రావొద్దంటూ పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. ఈ పనులపై వర్సిటీ అధికారులు కూడా నోరు మెదపకపోవడం గమనార్హం. పనులు జరుగుతున్న ప్రదేశానికి పది అడుగుల దూరంలోని ఔషధ విభాగం సమావేశపు హాలులో తేనెటీగల పెంపకంపై రైతుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి వర్సిటీ ఉపకులపతి నీరజా ప్రభాకర్ హాజరైనా పనులపై ప్రశ్నించలేదు. విషయం తెలిసిన పలు ప్రజాసంఘాలు స్పందించాయి. సోమవారం పనులను అడ్డుకునేందుకు పిలుపునిచ్చాయి. హైకోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గతంలో విద్యార్థులు ఆందోళన చేసినప్పుడు చర్చలు జరుపుతామని హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం ఆ తర్వాత ఆ ఊసే మర్చిపోయారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.


### గతమెంతో ఘనం

40 ఏండ్ల చరిత్ర కలిగిన రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీ భూముల్లోని అటవీ సంపద ఇప్పుడు ధ్వంసమైపోతున్నది. విలువైన వృక్ష సంపద నాశనం అయిపోతున్నది. పోలీసుల పహారాలో భారీ యంత్రాలతో చెట్లను కూల్చివేస్తూ హైకోర్టు నిర్మాణానికి అనువుగా భూమిని చదునుచేస్తున్నారు. పనులను ఎవరూ అడ్డుకోకుండా పోలీసులను పెద్ద ఎత్తున మోహరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనం మరో 100 ఏండ్ల వరకు సేవలు అందించగలదని, అక్కడే రూ. 100 కోట్లతో వసతులు కల్పిస్తే సరిపోయేదని నిపుణులు చెప్తున్నారు. హైకోర్టు నిర్మాణం ద్వారా అటు రైతులకు, ఇటు వ్యవసాయ పరిశోధనలకు, వర్సిటీ విద్యార్థులకు అపారనష్టం జరుగుతుందని వాపోతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మొండిగా ముందుకే వెళ్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైకోర్టుకు కేటాయించిన 100 ఎకరాల బయోడైవర్సిటీ భూముల విలువ రూ. 6 లక్షల కోట్లు ఉంటుందని అంచనా.

# రాజకీయ కక్షతోనే ఫోర్జరీ కేసు

**2016లోనే భూమి కొనుగోలు చేశాను**

- స్థలంపై 32 ఏండ్లుగా న్యాయవివాదం లేదు
- ఎన్నికల అఫిడవిట్‌లోనూ చూపించా
- వివరణ అడగకుండానే కేసు నమోదు
- ఎలాంటి న్యాయ విచారణకైనా సిద్ధం
- మాజీ ఎంపీ సంతోష్‌కుమార్



PTI NO
: 1100851672
Name
: JOGINIPALLY SANTOSH KUMAR
Door No
: 8-2-316/1/A/1
Locality
: BANJARAHILLS
Circle
: 18-Jubilee Hills

H. No 8-2-316/1/A, sY nO 129/54 Road No 14, (Rear Side), Banjara Hills Hyderabad 500034 Total Area 904 Sq.Yrd. Built Up Area 468 Sq.ft. Whether Inherited N Purchase Date 2016-11-11 Purchase Cost 40488000.00 Development Cost 2332260.00 5,00,00,000

| Tax Details | Demand Year | Tax Amount (₹) | Interest(₹) | Total (₹) | Payment Status |
|---|---|---|---|---|---|
| Current Tax | 2023-2024-1 | 65120 | 0 | 65120 | Cleared |
| Current Tax | 2023-2024-2 | 65120 | 0 | 65120 | Cleared |
| | Total (₹) | 130240 | 0 | 130240 | |

Total Current Market Value of (i) to (v) (as per Affidavit) 7,55,00,000 60,00,000 Nil

Adjustment Amount from Previous Years(₹)
Tax Shown below is after Deducting of Adjustment Amount.

మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ చెల్లించిన ఆస్తి పన్ను, ఎన్నికల అఫిడవిట్ వివరాలు

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): తనపై రాజకీయ కక్షతోనే అక్రమంగా కేసులు నమోదు చేశారని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు. 32 ఏండ్లుగా న్యాయ వివాదం లేని స్థలంపై ఇప్పుడు ఆరోపణలు రావడం వెనుక ఎవరు ఉన్నారో సులభంగా గుర్తించవచ్చని చెప్పారు. నకిలీ పత్రాలతో తమ భూమిని ఎంపీ సంతోష్‌కుమార్ కబ్జా చేశారంటూ నవయుగ కంపెనీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై సంతోష్ స్పందిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. షేక్‌పేటలోని సర్వే నంబర్ 129/54లో డోర్ నంబర్ 8-2-316/1/A/1 తో (బంజారాహిల్స్, రోడ్ నంబర్ 14) ఉన్న 904 చదరపు గజాల ఇంటి స్థలాన్ని తాను శ్యాంసుందర్ పుల్జాల్ (తండ్రి పీవీ హన్మంతరావు) అనే వ్యక్తి నుంచి 2016 నవంబర్ 11న సేల్ డీడ్ నంబర్ 5917/2016 ద్వారా చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. ఇందుకోసం రూ.3,81,50,000 చెల్లించానని తెలిపారు. 'బాజాప్తా సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేశాను. కాబట్టి ఫోర్జరీ అనే మాటకు తావులేదు. ఈ స్థలంపై ఎనిమిదేండ్లుగా ఎలాంటి న్యాయవివాదం తలెత్తలేదు. నన్ను ఎవరూ సంప్రదించలేదు' అని స్పష్టం చేశారు. తనకు ఇంటి స్థలాన్ని అమ్మిన శ్యాంసుందర్ ఆ భూమిని 1992లో సేల్ డీడ్ నంబర్ 1888/1992 ద్వారా కొనుగోలు చేసినట్టు వివరించారు. అప్పటి నుంచి న్యాయవివాదాలు లేవని శ్యాంసుందర్ తనకు స్పష్టంగా చెప్పారని తెలిపారు. 'ఆ స్థలం 32 ఏండ్లుగా నాకు అమ్మిన వ్యక్తి, నా ఆధీనంలోనే ఉన్నది. ఆ భూమిపై ఎలాంటి న్యాయ వివాదాలు లేవు' అని పేర్కొన్నారు. తాను కొనుగోలు చేసిన తర్వాత ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని.. శ్యాంసుందర్, అంతకన్నా ముందు వాళ్లు చేపట్టిన నిర్మాణాలే ఇప్పటికీ ఉన్నాయని స్పష్టం చేశారు.

### బహిరంగంగానే వివరాలు

షేక్‌పేటలోని తన ఆస్తి వివరాలను గోప్యంగా ఉంచలేదని సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ సమయంలో ఆస్తుల వివరాలు వెల్లడించినట్టు గుర్తుచేశారు. స్థిరాస్తుల వివరాల్లో ఈ 904 గజాల స్థలం గురించి కూడా స్పష్టంగా తెలియజేసినట్టు చెప్పారు. 2016లో కొనుగోలు చేసినప్పటి నుంచి ఆస్తిపన్ను కడుతున్నానని, 2023-24కు సంబంధించి జీహెచ్‌ఎంసీకి ఆస్తిపన్ను కింద రూ.1,30,240 చెల్లించినట్టు పేర్కొన్నారు. నిరుడు ఏప్రిల్ 30న ఈ మొత్తాన్ని చెల్లించానని వెల్లడించారు. కావాలంటే ఈ వివరాలను ఎవరైనా చెక్ చేసుకోవచ్చని తెలిపారు.

### నిందలు వేస్తే సహించేది లేదు

ఆ స్థలంపై ఏమైనా న్యాయపరమైన అంశాలు ఉంటే ముందుగా తనకు లీగల్ నోటీసు ఇవ్వాలని, వివరణ అడగాలని సంతోష్‌కుమార్ అభిప్రాయపడ్డారు. అలాంటివేమీ లేకుండా నేరుగా పోలీస్ స్టేషన్లో ఫోర్జరీ చేశామంటూ ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వివాదాస్పద స్థలం 1350 గజాలు అని పోలీసులు పేర్కొన్నారని, మీడియాలోనూ అలానే వస్తున్నదని, కానీ తాను కొన్నది 904 గజాల ఇంటి స్థలం మాత్రమేనని స్పష్టం చేశారు. దీనిని బట్టి కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసు నమోదు చేశారని స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. 32 ఏండ్లుగా లేని వివాదం కొత్తగా ఇప్పుడు ఎందుకు తెర మీదికి వచ్చిందో సులభంగా అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. 'నేను బాజాప్తా డబ్బులు పెట్టి కొన్న ఆస్తిపై అనవసర నిందలు వేస్తూ, ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారు. నేను ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదు. నేను కొనుగోలు చేసిన భూమిపై ఎవరైనా విచారణ చేసుకోవచ్చు. నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. న్యాయపరంగా ఎదుర్కోవడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అని స్పష్టం చేశారు. తనపై, తమ పార్టీపై రాజకీయ కక్షతో బురద జల్లాలని చూస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. తప్పుడు ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించాలని చూస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

# కిషన్‌రెడ్డిని ఈడీ విచారించాలి

- కేసీఆర్, కేజ్రీవాల్‌ను చూస్తే బీజేపీకి వణుకు
- ఎన్నికలొస్తున్నాయనే అరెస్టులు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్



తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థులు క్యామ మల్లేశ్, కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సైతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కేసులో కిషన్‌రెడ్డికి సైతం భాగస్వామ్యం ఉన్నదేమోనన్న అనుమానం వ్యక్తంచేశారు. తన వద్ద ఆధారాలు ఉన్నాయని, నిరూపిస్తానని చెప్తున్న కిషన్‌రెడ్డి రెండేండ్లుగా వాటిని ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డికి సోయిలేదని, ఎప్పుడేమి మాట్లాడుతాడో ఆయనకే తెలియదని మండిపడ్డారు. తొలుత కవిత కేసుతో తెలంగాణకు సంబంధం లేదన్నారని, ఇప్పుడు మాటమార్చి తాను నిరూపిస్తానని ఎలా అంటారని ప్రశ్నించారు. ఈడీకి బదులుగా తానే విచారణ చేస్తానని కిషన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదని మండిపడ్డారు. మీడియాలో స్పేస్ తప్ప ప్రజల్లో బేస్ లేని నాయకుడు కిషన్‌రెడ్డి అని ఎద్దేవాచేశారు. ప్రజలను కొట్టాలే, అదానీకి పెట్టాలన్న ఆలోచన తప్ప బీజేపీ మరో ఆలోచన లేదని విమర్శించారు. దేశంలో బీజేపీకి కేసీఆర్, కేజ్రీవాల్ వణుకుపుట్టిస్తున్నారని, అందుకే ఎన్నికల వేళ ఈడీని ఉసిగొల్పి తప్పుడు కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ అవగాహన ప్రకారమే పరస్పరం బలహీన అభ్యర్థులను నిలబెడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ వేటకుక్కల్లా బీఆర్‌ఎస్ నేతలను ఎత్తుకుపోతున్నాయని, తమ పార్టీ నేతలను భయపెట్టి దౌర్జన్యంగా చేర్చుకుంటున్నారని ఆరోపించారు.

### రైతులను ఆదుకునే సోయిలేదు

ఎండిపోతున్న పొలాలకు నీళ్లిచ్చి, రైతులను ఆదుకోవాలన్న సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేకుండా పోయిందని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో పరిస్థితి ఘోరంగా ఉన్నదని, ఎస్సారెస్పీ, వరదకాల్వ వెంట లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రులు పాలన గాలికొదిలేశారని, సమీక్షలు చేయడంలేదని మండిపడ్డారు. కాళేశ్వరం నుంచి నీళ్లు తెచ్చుకునే అవకాశం ఉన్నా ఆ ప్రయత్నం చేయలేదని విమర్శించారు.కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీళ్లు తెచ్చేందుకు ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. కరువుపై, రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై బీజేపీ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు.

### నల్లగొండ మంత్రులకు లాగులు తడుస్తున్నాయి

'నాగార్జునసాగర్ కట్ట మీదికి పోవాలంటేనే నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రుల లాగులు తడుస్తున్నాయని జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి దమ్ముంటే సాగర్ కట్ట మీద నడవాలని, ఎడమకాల్వ తూములు తీసి నీళ్ల తీసుకొని రావాలని సవాల్ చేశారు. నీళ్ల విషయంలో సోయి లేక పది రోజులుగా నిద్ర నటిస్తున్నాడని, దొంగలాగ తప్పించుకు తిరుగుతున్నాడని విమర్శించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కనీసం పరిజ్ఞానం లేదని,కోదాడ,హుజూర్‌నగర్‌లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ నేతలు నల్లగొండ జిల్లాలో మంత్రులు రైస్‌మిల్లర్లు, క్రషర్లు, కాంట్రాక్టర్ల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏమీ లేకపోయినా ఇక్కడ,అక్కడ రూ.100 కోట్ల రోడ్లుంటూ నలుగురు కాంట్రాక్టర్లను పిలిచి వసూళ్లు చేసిన చరిత్ర నల్లగొండ మంత్రులదని విమర్శించారు. ఇండ్లు కట్టుకున్నవారికి నోటీసులిచ్చి యాభై వేలు, లక్ష వసూలు చేసేంత నీచానికి దిగజారారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



విశాఖలో జరగనున్న టైగర్ ట్రయంప్-24 విన్యాసాల కోసం బాహుబలి నౌకగా పేరొందిన 'యూఎస్ సోమర్సెట్' విశాఖ తీరానికి చేరుకున్నది. భారత్, అమెరికా దేశాల సైనిక సంబంధాలు బలోపేతమయ్యేలా బంగాళాఖాతంలో విశాఖ కేంద్రంగా ఈ ప్రత్యేక సాగర విన్యాసాలు జరుగుతాయని నేవీ అధికారులు ఆదివారం తెలిపారు. ఈ బాహుబలి నౌకలో 25 భారీ యుద్ధ ట్యాంకర్లు, 4 యుద్ధ హెలికాప్టర్లు, నలువైపులా ఆయుధ ట్యాంకులు, వెయ్యి మంది సిబ్బంది ఉంటారు. 2011 సెప్టెంబర్ 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై జరిగిన ఉగ్రదాడిలో మరణించిన 93 మంది స్మారకంగా ఈ నౌకను నిర్మించారు. *- హైదరాబాద్, నమస్తే తెలంగాణ*

# క్యామను గెలిపించుకుంటాం: గోసుల

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు గొల్లకురుమ (యాదవ) హక్కుల పోరాట సమితి పూర్తి మద్దతు ప్రకటిస్తుందని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ చరిత్రలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తొలిసారి గొల్లకురుమ వ్యక్తికి పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇచ్చినందుకు గొల్లకురుమల తరపున బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయంగా, సామాజికంగా బీఆర్‌ఎస్‌తోనే గొల్ల కురుమలకు న్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. కేసీఆర్ గొల్ల కురుమలకు రాజకీయ పదవులిచ్చి తమ గౌరవం పెంచారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# వరంగల్ కాదంటే కరీంనగర్‌పై సీపీ'ఐ'!

- లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి సై
- కాంగ్రెస్‌తో తేలని పొత్తు
- నేతల్లో ఆతృత.. క్యాడర్‌లో అయోమయం

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు కొలిక్కిరావడం లేదు.రాష్ట్రంలో ఏదైనా ఓ స్థానం నుంచి పోటీ చేయాలని సీపీఐ రాష్ట్ర స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు వరంగల్ లేదా కరీంనగర్ స్థానాల్లో ఏదైనా ఒకటి తమకు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద సీపీఐ రాష్ట్ర నేతలు ప్రతిపాదనలు ఉంచారు. ఆ విషయంలో కాంగ్రెస్ పెద్దలు క్లారిటీ ఇవ్వనేలేదు. అవసరమైతే రాష్ట్రంలోని మొత్తం స్థానాల్లో సీపీఐ బరిలో దిగేందుకే మొగ్గు చూపుతున్నది. అయితే తొలి నుంచి వరంగల్ స్థానం ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేస్తూ వస్తున్నది. తమ అభ్యర్థిని కూడా సిద్ధం చేసుకున్నట్టు ప్రచారం జరిగింది. కానీ పొత్తు విషయమే కాంగ్రెస్ చర్చించడం లేదని తెలుస్తున్నది. షెడ్యూల్ విడుదలైనా పొత్తుల పై క్లారిటీ లేకపోవడంపై సీపీఐ క్యాడర్‌లో అయోమయం నెలకొన్నది.

### ఒంటరి పోరుకు మొగ్గు?

వరంగల్ స్థానంలో పోటీకి కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఒకవేళ వరంగల్ నుంచి కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తే కరీంనగర్ సీటు తమ పార్టీకి ఇవ్వాలని సీపీఐ కోరుతున్నది. ఇప్పటికే సీపీఐ సీనియర్ నేత చాడ వెంకటరెడ్డి ఆ పార్టీ ముఖ్య నేతలతో ఈ విషయమై సమావేశమై చర్చించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో తాము బలంగా ఉన్నామని, అవసరమైతే ఒంటరిగా బరిలోకి దిగేందుకు రెడీగా ఉన్నామని సీపీఐ నేతలు స్వయంగా చెప్తున్నారు. గతంలో హుస్నాబాద్, సిరిసిల్లలో సీపీఐ విజయం సాధించగా, మానకొండూరు నియోజకవర్గంలోనూ బలంగా ఉన్నామని చెప్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో తాడోపేడో తేల్చుకోవడనికి కమ్యూనిస్టులు సిద్ధమవుతున్నారు.

# కాంగ్రెస్‌లో అసమ్మతి!

▸ మొదటిపేజీ తరువాయి...

ఎన్నికల్లో తమకు టికెట్లు లభించకపోయినప్పటికీ కనీసం పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అవకాశమైనా దక్కుతుందని భావించారు. ఇప్పుడు ఆ ఆశలు కూడా ఆవిరైపోవడంతో సీనియర్లకు మింగుడు పడటం లేదు. మొన్నటి దాకా అధికారాన్ని అనుభవించిన నాయకులను అప్పటికప్పుడు కాంగ్రెస్‌లో చేర్చుకుని లోక్‌సభ టికెట్లు ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కొందరు నేతలు బాహాటంగానే అసమ్మతి గళాన్ని విప్పుతూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వ వైఖరిని తూర్పారబడుతున్నారు. దీంతో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరి ఎంపీ టికెట్లు దక్కించుకున్న అభ్యర్థులు కూడా ఆందోళన చెందుతున్నారు. తమ విజయానికి పార్టీ క్యాడర్ సహకరిస్తుందా? లేదా? అని అనుమానిస్తున్నారు.

### 'క్లియరెన్స్ సేల్' చిట్కాతో..

కొత్త సరుకును అమ్ముకునేందుకు పాత సరుకును 'క్లియరెన్స్ సేల్' పేరుతో కారుచౌకగా అమ్మడం వ్యాపారులు అనుసరించే చిట్కా. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని టీపీసీసీ సైతం ఇదే విధానాన్ని అనుసరిస్తున్నది. ఖమ్మం ఎంపీ టికెట్‌ను తనకు అనువైన వ్యక్తికి ఇప్పించుకునేందుకు రేణుకా చౌదరిని రాజ్యసభకు పంపిన రేవంత్‌రెడ్డి.. వరంగల్ టికెట్‌ను ఆశించిన సిరిసిల్ల రాజయ్యకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ పదవిని, భువనగిరి టికెట్‌ను ఆశించిన పటేల్ రమేశ్‌రెడ్డికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవిని కట్టబెట్టిన విషయం విధితమే. నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను డాక్టర్ మల్లు రవికి కట్టబెట్టాలన్న ఆలోచనతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌కు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇంతకాలం ఆయా పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో అసమ్మతి రాజుకుంటున్నది.

### అగ్గి రాజేస్తున్న నామినేటెడ్ పోస్టులు

నామినేటెడ్ పోస్టుల పందేరం కూడా రేవంత్ మంత్రివర్గ సహచరుల మధ్య అగ్గి రాజేస్తున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నామినేటెడ్ పోస్టులన్నీ మంత్రి శ్రీధర్‌బాబు అనుచరులకే దక్కాయని అదే జిల్లాకు చెందిన మరో మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పదవులు ఇచ్చే ముందు మాటమాత్రానికైనా సంప్రదించలేదని సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరకు ఒక్క కార్పొరేషన్ పదవి కూడా దక్కకపోవడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహంతో రగిలిపోతున్నారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి విజయంలో కీలకభూమిక పోషించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తమ నామినేటెడ్ పోస్టులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆ పదవులను స్వీకరించేందుకు వారు విముఖతతో ఉన్నట్టు సమాచారం. ఈ అసమ్మతి సెగలన్నీ ఏ క్షణమైనా భగ్గుమనే అవకాశం లేకపోలేదని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### అసమ్మతి నేతల ప్రెస్‌మీట్లపై ఆంక్షలు

రాష్ట్ర కాంగ్రెస్‌లో ముదురుతున్న అసమ్మతిని మొగ్గ దశలోనే తుంచేసేందుకు టీపీసీసీ అప్రమత్తమైంది. గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్లు పెట్టకుండా కట్టడి చర్యలు చేపట్టింది. ఎవరైనా ప్రెస్‌మీట్‌లో ఏ అంశంపై మాట్లాడబోతున్నారో తెలుసుకున్నాకే అనుమతి ఇవ్వాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను పార్టీ అధిష్ఠానం ఆదేశించినట్టు తెలిసింది. కాంగ్రెస్‌ను ఇరకాటపెట్టే నాయకుల ప్రెస్‌మీట్లకు లైవ్ కవరేజీ ఇవ్వకుండా చూడాలని పార్టీ పెద్దల నుంచి మీడియా ఇన్‌చార్జికి ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం.

### జలగంకు బీజేపీ షాక్

- చివరి జాబితాలో దక్కని చోటు
- వరంగల్ అభ్యర్థిగా అరూరి రమేశ్, ఖమ్మం నుంచి తాండ్ర వినోద్‌రావు

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ చివరి జాబితాను విడుదల చేసింది. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అరూరి రమేశ్, ఖమ్మం అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఆదివారం ప్రకటించింది. ఖమ్మం నుంచి టికెట్ ఆశించి బీజేపీలో చేరిన జలగం వెంకట్రావుకు పార్టీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. మొదట్లో జలగం వెంకట్రావుకు టికెట్ ఇస్తారని పార్టీవర్గాలు తెలిపాయి. ఆయన కూడా ప్రచారం మొదలుపెట్టారు. కానీ, బీజేపీ మరొకరి కోసం వెదుకుతున్నదని ప్రచారం మొదలైంది. దీంతో వెంకట్రావు తరుచూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర పెద్దలను కలిసి విజ్ఞప్తి చేశారు. అలాగే టీడీపీతో పొత్తు పెట్టుకొని, ఖమ్మం టికెట్‌ను ఇస్తారనే ప్రచారం సాగింది. అనూహ్యంగా వినోద్‌రావు పేరును బీజేపీ పెద్దలు ఖరారు చేశారు. దీంతో జలగం కార్యాచరణ ఏమిటనేది ఆసక్తికరంగామారింది.

# గురుకుల పోస్టుల భర్తీపై కమిటీ!

- మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని అభ్యర్థుల వెల్లడి

హైదరాబాద్, మార్చి24 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో బ్యాక్‌లాగ్‌లు లేకుండా చూస్తామని, అందుకోసం బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కమిటీని వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమకు హామీ ఇచ్చారని పలువురు గురుకుల అభ్యర్థులు తెలిపారు. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో ఆదివారం ప్రత్యేకంగా కలిశామని 1:2 జాబితాలో ఎంపికైన వివిధ జిల్లాలకు చెందిన అభ్యర్థులు శ్రీనివాస్, ఎంటీ రాజు, జయశంకర్ గౌడ్, సైదులు, వెంకటేశ్, రమేశ్, సంతోష్, సౌజన్య తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిబ్ చేపట్టిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, జనరల్ గురుకుల పోస్టుల భర్తీలోని సమస్యలపై అధ్యయనం చేసేందుకు మంత్రి ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. గురుకుల పోస్టులను ట్రిబ్ ఇటీవల భర్తీ చేయగా, డీసెండింగ్ ఆర్డర్‌లో నియామకాలు చేపట్టలేదు. అంటే తొలుత డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ క్రమంలో పోస్టుల భర్తీ చేపట్టకపోవడమే గాకుండా, వెయింటింగ్ జాబితా కూడా లేదని ట్రిబ్ స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే నింపిన దాదాపు 8,700 పోస్టుల్లో దాదాపు సగం మేరకు మళ్లీ ఖాళీగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఏ ఒక్క పోస్టు కూడా బ్యాక్‌లాగ్ లేకుండా భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులను ఆదేశించాలని సీఎంను కోరామని, సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వారు ఆ ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గ్యాస్ లీకేజీతో దగ్ధమైన సామగ్రి

# భార్యపై కోపం.. గ్యాస్ లీక్ చేసిన భర్త

- కాలిబూడిదైన నిత్యావసరాలు, ఇతర సామగ్రి

ఆత్మకూరు, మార్చి24: భార్య మీద కోపంతో భర్త ఇంట్లోని గ్యాస్‌ను వదిలేసి బయటకు వెళ్లాడు. మంటలు అంటుకుని ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ స్టేజీ వద్ద చోటుచేసుకున్నది. గూడెప్పాడ్ గ్రామానికి చెందిన మహ్మద్ అక్తర్ పాషాతో భార్య నసీమాకు రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. దీంతో నసీమా తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి గారింటికి వెళ్లింది. భార్య పుట్టింటికి వెళ్లిందన్న కోపంతో అక్తర్ ఇంట్లో ఉన్న వంట గ్యాస్‌ను ఓపెన్ చేసి బయటకు వెళ్లిపోయాడు. దీంతో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే ఇంట్లోని వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

## 'మంత్రుల పిల్లలకు టికెట్లివ్వడం వారసత్వ రాజకీయం కాదు'

మైసూరు: మంత్రుల పిల్లలకు, బంధువులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం వారసత్వ రాజకీయం కాదని కర్ణాటక ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య చెప్పారు. ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రజల మద్దతు ఉండటంతోనే వారికి టికెట్‌లు ఇచ్చామని పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల్లో పలువురు రాష్ట్ర మంత్రుల కుమారులు, కుమార్తెలు, బంధువులకు కాంగ్రెస్ టికెట్లు ఇచ్చింది. జాబితాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి కూడా ఉన్నారు. ఇటువంటి 10 మందికి టికెట్లు ఇవ్వడంపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ, ప్రజాభిప్రాయాన్ని తాము స్వీకరించామన్నారు.

## చంద్రుడిపై రైల్వే లైన్!

న్యూయార్క్, మార్చి 24: చంద్రుడిపై రైల్వే లైన్ నిర్మించేందుకు అమెరికా ప్రభుత్వ ఏజెన్సీ 'డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ ప్రాజెక్ట్ ఏజెన్సీ' (డీఏఆర్‌పీఏ) ప్రణాళికలు రచిస్తున్నది. ముందుగా దీనికి సంబంధించి ఓ కాన్సెప్ట్‌ను అభివృద్ధి చేయటంపై కసరత్తు చేస్తున్నది. 'లూనార్ రైల్వే కాన్సెప్ట్'ను అభివృద్ధి చేసేందుకు 'నార్త్రోప్ గ్రుమ్మాన్' అనే కంపెనీకి కాంట్రాక్ట్‌ను అప్పగించింది. చంద్రుడిపై రైల్వే లైన్ ఎలా నిర్మించవచ్చు? అనే దానిపై ఈ కంపెనీ ప్రణాళిక రూపొందించనున్నది. చంద్రుడిపై శాశ్వత మానవ నివాస కాలనీలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా 'డీఏఆర్‌పీఏ' ఓ ప్రాజెక్ట్ చేపట్టింది. 10 ఏండ్ల-లూనార్ ఆర్కిటెక్చర్ క్యాపబిలిటీ స్టడీ అన్న దాంట్లో భాగంగానే 'లూనార్ రైల్వే కాన్సెప్ట్'ను రూపొందిస్తున్నది.

# ఆటో షో.. గ్రాండ్ సక్సెస్

- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరైన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి, ఆర్డీవో మహేశ్వర్
- భారీగా తరలివచ్చిన సందర్శకులు





ఆటో ఎక్స్‌పోలో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మార్చి 24: కరీంనగర్ జిల్లా కేంద్రం మహాత్మా జ్యోతిబాపూలే సర్కస్ గ్రౌండ్‌లో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో ఎక్స్‌పో గ్రాండ్ సక్సెస్ అయింది. ఆదివారం ఈ ఎక్స్‌పో ముగింపు వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాలభవన్ సంగెం రాధాకృష్ణ బృందం చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ షోలో మెయిన్ స్పాన్సర్ ఆదర్శ ఆటో మోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అసోసియేట్ స్పాన్సర్లు మహావీర్ గ్రూప్ మెర్సిడెస్ బెంజ్, ఆడి హైదరాబాద్, వోల్వో, మహావీర్ ఐసుజు, ప్రైడ్ జీప్, గ్రీన్ హోండా, మోటార్ లైన్ మహీంద్ర డీలర్, క్వాంటం ఈ స్కూటర్స్, కాకతీయ టయోటా, మారుతి సుజుకి, నెక్సా, మారుతి సుజుకి అరేన, ఆదర్శ ట్రూ వాల్యూ, మాలిక్ కియా, హమారా సుజుకి సంస్థలతోపాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర బ్యాంకులు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. చివరి రోజు సందర్శకులు భారీగా తరలివచ్చి ఆకట్టుకునేలా బుకింగ్స్ చేశారు.

### వాహన ప్రియులకు సువర్ణావకాశం

ఒకే దగ్గర అన్ని రకాల వాహనాలు ఉంచడం వాహన ప్రియులందరికీ మంచి అవకాశం. ఇందుకు 'నమస్తే తెలంగాణ' బాధ్యతయుతంగా వ్యవహరించింది. మారుతి నుంచి మెర్సిడెజ్ వరకు అన్ని వర్గాలకు అందుబాటు ఉండేలా వాహనాలు, వాటి కొనుగోలు కోసం బ్యాంకులను అందుబాటులో ఉంచడం అభినందనీయం.

*-కొండూరి రవీందర్‌రావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్*

### ఒకే చోట అన్ని రకాల వాహనాలు

కరీంనగర్ నగరంలోని సెంటర్ ఆఫ్ సీటీలో 'నమస్తే తెంగాణ' ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో ఎక్స్‌పోలో అన్ని రకాల కంపెనీలకు చెందిన వాహనాలున్నాయి. మార్కెట్‌లో ఉన్న కొత్త వాహనాలతోపాటు ఎక్స్ఛేంజ్ చేసుకునే అవకాశం కల్పించడం సంతోషకరం. షోరూంకు పోయి ఒక వాహనం చూడగలం. ఇక్కడ అన్ని రకాల కంపెనీల వాహనాలను అందుబాటులో ఉంచిన 'నమస్తే తెంగాణ'కు అభినందనలు.

*-కే మహేశ్వర్, కరీంనగర్ ఆర్డీవో*

